
# గూడులేని గువ్వలు

పులికంటి కృష్ణారెడ్డి




*జ్యోతిషం శాస్త్రం కావచ్చు, కాక పోవచ్చు. కాని జోస్యం ఫలించితే బాధ్యత ఎవరిది? అసలు బాధ్యత ఉంటుందా? సమాధానాలు ఏమైనా మానవత్వాన్ని పరీక్షించే ప్రశ్నలు ఇవి.*

---

గెరిగల చింతమానుదాటి, కట్టూ గాలవ దాటి, బొంతల గంగమ్మగుడిదాటి, ఇరగమరెడ్డి చెరువు కట్టమీద నడుస్తున్నాడు పుల్లయ్య. అతని మనస్సు వెనక్కు లాగుతూఉంది. కాళ్ళు భారంగా ముందుకు పడుతున్నాయి. చిగర చెట్టుమీద సగిణంపిట్ట ఎడమప్రక్కనుండి కుడి ప్రక్కకు 'తుర్రు' మని ఎగిరిపోయింది. దానితో 'ఇక ఫరవాలే'దని తెపరాయించుకొన్నాడు. బయలుదేరేటప్పుడు తానేమో స్వరం చూచుకొన్నాడు. 'సూర్యనాడి' బాగా ఆడుతూఉండినది. లేదంటే కాస్త ఉడుకు తక్కువనిపించింది. 'దిన వాడి' కాబట్టి ధైర్యంగా బయలుదేరాడు. తీరా గవిన్లో అడుగుబెట్టేసరికి ముండమోపి గోయిందమ్మ నెత్తిమీద కట్టెల మోపుంచుకొని ఎదురయింది. 'చెడిందిరా కార్య' మనుకొన్నాడు. తిరిగి పోదామనిపించింది. 'ఇప్పుడు చెడిందానికంటె ఇంకేమి చెడబోతుందిలే! నిండా మునిగితే చలేలేదు'—అని ముందుకే అడుగు వేశాడు. మొండిగా ముందుకు పోతున్నా అతని గుండె 'దిక్కు దిక్కు' మంటూనే ఉంది. సగిణం పిట్ట కంటబడింది. కాస్త హుషారు కలిగింది.

ప్రొద్దు వాలింది. ఇంకా ఎండదెబ్బ అణగ లేదు. భుజంమీద బుల్లోడు ఎండవడకు తట్టుకోలేకపోతున్నాడు. పుల్లయ్య తలగుడ్డను రెండు చేతులంతో పొదివి పట్టుకున్నాడు. తలవాల్చి నిద్రబోతున్నాడు. వాడుకలేని పని. భుజం పీకుతూఉంది. అటూ, ఇటూ మార్చుకొందామంటే పిల్లవాడు నిద్రలేస్తాడు. చంకలో సద్దికూడు మూట. నడుమ్మింటే పెద్ద సొరకాయ బుర్ర మాదిరి ఈప్రక్కకూ, ఆప్రక్కకూ కొట్టుకుంటూ ఉంది. ఏపుగా పెరిగిన ముండ్ల కంపలు, తీగలు కాలిబాటను కప్పివేసినాయి. దోవ ఇరకాటంగా ఉంది. దీనికి తోడు కాళ్ళ నిండా అనెలు. ఒక కాలి చెప్పుకు ఉంగరం తెగిపో

యింది. మందగుదివచ్చిన గొడ్డులాగ కాళ్లీడ్చుకొంటూ నడుస్తున్నాడు.మనిషి గుమ్మడిపండులా గుమ్మటంగా, తాటికాయరంగుతో ఉంటాడు. నల్లబండపై నీళ్ల గారినట్లు చెమట కారుతూ ఉంది. దారి సాగడం లేదు. 'పనుబాకు రైలు పేసిను ఇంకా పదిమైళ్లుంది. ఒక మాధిరి కాలాడిస్తేనేగాని రైలందదు'—అనుకొంటూ నచ్చుకూరు చెరువు మొరవలో నడుస్తున్నాడు. చెరువులో నెండ్రకాయలు, నత్తగుల్లలు మెక్కడానికి వచ్చినట్లుందొక పొట్టేనక్క! పుల్లయ్యను చూచి చెట్లల్లోకి పరుగుదీసింది. పోతూపోతూ మిట్టమీద నుండి ఒక్కసారి వెనక్కు తిరిగి చూసింది. 'పొట్టేబావ సగిణం! గెట్టే సగిణం!!'- అనుకొన్నాడు. ఇంకొంచెం నిబ్బరాన్ని పుంజుకొన్నాడు. గబగబ అడుగులు ముందుకు పడుతున్నాయి.

ఎండమొగం చూడకుండా, కష్టం జోలి పట్టించుకోకుండా, ఆ పల్లెటూళ్లో అరవయ్యోపడిలో పడ్డాడు పుల్లయ్య. అంటే—అతడేమీ ఆగర్భ శ్రీమంతుడు కాడు. ఒక నాలుగు గుంటల మడి, ఎనిమిది గుంటల చేను మినహా భూమి పుట్ర ఏమీ లేదు. అయితే అంతపూసాటుగ ఎలా బ్రతగ్గలిగాడు? అంటే—అతని తాత ముత్తాతలు ఒక జోలెడు రాళ్ళు పెట్టిపోయారు. ఒక్కొక్కటి ఒక గుండ్రాయి మోపినఉంటాయి. అన్నిరాళ్ళూ ఒకటే రంగు! ముదురు ఎరుపు!

'ఓయ్ బావా! విన్నఆడివికి ఆవుల తోలంటి. దానితాడు తెగ, దాటు దోనెలో దోసెడు నీళ్లు తాగితి. ఇయ్యాళ పడిశం పట్టిందోయ్!.... నోట్లో ముక్కుల్లో కూడా కారతాఉంది' అని ఒక వయసు మళ్లినతడు వస్తాడు.

'కణతలు పీకేస్తాఉండాయ్ తాతా! తలపోటు చెప్ప నలివిగాదు. రవంత మందియ్యి!' అంటూ ఒక పిల్లవాడు వస్తాడు.

'జరం దగిలింది మాఁవా! దీని సిగదరగ!... చలొస్తే ఎత్తెత్తి పారేస్తాఉంది!' అంటూ ఒక నడికారాయన వణుకుతూ వస్తాడు.

పుల్లయ్య జోలి తీసుకుంటాడు. ఒక్కొక్క రాతిని ఒక్కొక్క చుట్టు సానరాతిమీద అరగదీస్తాడు. సత్తులోటా నిండుగ మంచినీళ్లు తీసుకొంటాడు. అరగదీసిన మందు అందులో కలుపుతాడు. లేచి ఉత్తర ముఖంగా నిలబడతాడు. సత్తు లోటాను రెండు చేతులతో పైకెత్తి పట్టుకుంటాడు. 'తండ్రీ! ఏడుకొండలవాడా! నా మందుగాదు, నీ మందు సామీ! తల్లీ! బాట గంగమ్మా! పెనుమూరు ముత్యాలమ్మా! చంద్రగిరి మూలస్థానమ్మా! నా మందు గాదు. మీ మందు తల్లీ!'— అంటూ భగవదర్పితంగా మూడు చుక్కలు నేలమీద వేస్తాడు. తలా ఒక గుక్క నోట్లో పోస్తాడు. సత్తులోటా నేలమీద బోర్లిస్తాడు. అందరికీ ఏక మూలికా ప్రయోగం! అది రామబాణం లాంటిది!!

మందుకంటె నమ్మకం బాగా పనిచేసేట్టుంది. ఆ సాయంత్రానికి తకీ మని తగ్గిపోతుంది. ఆ మరునాటి ఉదయాన 'తలనొప్పి తగ్గిపొయ్యింది తాతా!', 'జరం ఎగిరిపొయ్యింది మాఁవా!', 'పడిశం పారిపొయ్యిందిగదంటే బావా!' అంటూ వస్తారు. ఉత్తుత్త మాటలతో గాదు. అంతో ఇంతో ముట్టచెబుతారు. కూటిమీద కూరగా ఈ నాలుగు డబ్బులు ఉపయోగ పడుతాయి.

అంతేగాదు. అనుభవం పుల్లయ్యకు అంగసాముద్రికం, హస్తసాముద్రికం నేర్పింది. దానితో ఆయన మనిషిని ఎగాదిగా చూస్తాడు. టకటకా పదిరాళ్లు కొట్టేస్తాడు. ఏ ఒకటో రెండో తగులుతాయి. దానితో 'వక్కాకు' ఖర్చు గడిచిపోతుంది.

రామబాణం లాంటి మందు, శాస్త్రం చేతిలో ఉండిగూడ పుల్లయ్య భార్యను రక్షించుకోలేకపోయాడు. చెప్పకుండా, చెయ్యకుండా అంటే—అతని మందునుగాని, శాస్త్రాన్నిగాని పరీక్షించకుండా ఒకనాడామె 'రామా! రామా!!' అంటూ రామసాన్నిధ్యాన్ని చేరుకుంది. పుల్లయ్య ఒంటరివాడై పోయాడు. ఊరికి నైఋతిమూల ఉన్న పూరిగుడిసెలో తన చెయ్యి తాను కాల్చుకొంటూ కాలం తోస్తున్నాడు.

సాధారణంగా పల్లెటూరి బ్రతుకులో ఒక ప్రత్యేకత ఉంటుంది. నాగరకత, సంస్కృతి అన్న పదాలకు వాళ్లకు అర్థం తెలియదు. అయినా నాగరకత కంటే సంస్కృతి ఉత్కృష్టమని నడుచుకొంటూ ఉంటారు. మట్టిలో మాణిక్యముంటుంది. వారి మొరటుతనంలో రాటుదేలిన గుణాలుంటాయి. కష్టాల్లో ఆదుకోవడం, సుఖాన్ని పంచుకోవడం, మంచిని ప్రేమించడం, చెడ్డను చీదరించుకోవడం—వారిరక్తంలో జీర్ణించుక పోయాయి. సంఘీభావం వారిలో పుంజీభూతంగా ఉంది. ఈ మధ్య మునలయ్య పెళ్లాం మునిమాపువేళ చిలకపచ్చచీరగట్టి చేనిదగ్గరనుండి కసవుమోపు ఎత్తుకొని వస్తూఉండిందట. నల్లమొ్మళ్ల నరిసిగాడు తప్పతాగి ఒళ్ళు తెలియక, కళ్లు భ్రమిసి ఆమెను పట్టుకొన్నాడట. ఇది విని ఊళ్లో వాళ్లు మండిపోయారు. దవడపళ్లు రాలదన్నారు. తుమ్మచెక్క బెల్లం ఊరవేసిన కుండలన్నీ దుమ్ముచేశారు. ఆ రాత్రి పెద్దలంతా రచ్చబండదగ్గర మద్దిస్తం చేశారు. 'తాగినోడికి నూరు రూపాయలు తప్పని ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఇంత కట్టుబాటు, సంస్కృతి ఉన్న పల్లెటూళ్లో పుల్లయ్య లాంటి ఒక ఉడిగిన జీవికి, సంఘ సేవికి తలదాచుకోవటానికి చోటు కరువైపోయింది. అందరూ 'థూ థూ' అని కారి మొగాన ఊశారు. 'మందు మాకు తీసుకోగూడదు. ఊళ్లో ఒక పిట్ట వాడి ఇంటి కడప తొక్క కూడదు'—అని మాట కట్టుకొన్నారు. *ఎవ్వరో కుర్రకుంకలు మాటు మణిగిన వేళ* పూరి గుడిసెకు నిప్పంటించారు. దైవాధీనంగా పుల్లయ్య బ్రతికి బయటపడ్డాడు. ఆ నాటి నుండి బ్రతుకు దుర్భరమై పోయింది. పుట్టిపెరిగి, బ్రతికిన ఊరు ... లమ్మిన చోట కట్టెలమ్మవలసివచ్చింది.ఎప్పుడైతే ఊళ్లో వాళ్లు ఆ విధంగా నిర్ణయించుకున్నారని తెలిసిందో, అప్పుడే తానూ ఒక నిర్ణయానికి వచ్చేశాడు. అందుకే బయలుదేరి పోతున్నాడు.

నచ్చకూరు చెరువు మొరవదాటి మిట్టఎక్కాడు. పిల్లవాడు"ఒంటికి కూర్చోవాలి తాతా!"అన్నాడు. భుజంమీద నుండి బుల్లోణ్ణి దించాడు. ఉసూరుమంటూ వెనక్కు తిరిగి చూశాడు. ఆ మిట్ట మీద నుండి చూస్తే తనవూరు, గుంటకట్ట మీద వెలగచెట్టు, పెదరాగిమాను, నల్లగా పొగ చూరిన తన యింటి మొండి గోడలు, కాలీకాలక నిలిచిన దూలాలు—అన్నీ మసక మసగ్గా కనిపిస్తున్నాయి. ఆ ఊళ్లోనే తానూ, తన తలిదండ్రులూ, తాత ముత్తాతలూ — అందరూ పుట్టారు. అక్కడే పెరిగారు. అరవై సంవత్సరాలు తానూ కాలుమీద కాలువేసుకుని బ్రతికాడు. అందరికీ అంతో ఇంతో చేతనైనంతవరకు సహాయం చేశాడు. అంత బాగా బ్రతికిన ఊళ్లో నుండి శాశ్వతంగా బయలుదేరి వచ్చేస్తుంటే, ఒక్కడైనా మాటవరుసకు పలకరించిన పాపాన పోలేదు. తానేమి తప్పుచేశాడు?


గోపికాలోలుడు

చిత్రం—మేడిశెట్టి శంకర్రావు (అనకాపల్లి)

పిల్లవాడు ఒంటికి కూర్చున్నాడు. ఒకతుమ్మెద తంగేడు పువ్వుమీద వాలింది. పొంచి చూస్తూ ఉండి, చిన్నగ దానితోక పట్టుకున్నాడు. తుమ్మెద పట్టుబడింది. విలవిలా కొట్టుకొంటూ ఉంది. పిల్లవాడి కండ్లు మిలమిలా మెరుస్తున్నాయి.

మనసులో కారంగా, ఊరిమీద మమకారంగా పుల్లయ్య పల్లెవైపు చూస్తున్నాడు. అవే కాలి నిలిచిన మొండిగోడలు, ప్రక్కనే పచ్చంగా చిగిర్చిన చింతచెట్టు తన్నుజూచి నవ్వుతున్నాయి. అక్కడే, ఆ చింతచెట్టు క్రిందే, ఏడాదిక్రిందట...

* * * *

ఒకనాడు—

ప్రొద్దునెత్తిమీదఉంది. పుల్లయ్య మంచం మీద కూర్చున్నాడు. *మండే ఎండ పొడలు పొడ*లుగా మంచం మీద పడుతూ ఉంది. మధుమూర్తి సిగరెట్టు కాలుస్తూ 'షిరోపామిస్ట్రీ' చదివి చెబుతున్నాడు. అనుభవాలను అన్వయించు

# గూడులేని గువ్వలు

కొంటూ అర్థంచేసుకోయత్నిస్తున్నాడుపుల్లయ్య.

మధుమూర్తి ఆ ఊళ్ళో మహరాజు బిడ్డ. వయస్సు ముప్ఫయికి లోపుగా ఉంటుంది. బి. ఎ. వరకు చదువుకున్నాడు. కొన్నాళ్ళపాటు ఉద్యోగం మీద మోజులో ఊరూరు తిరిగాడు. అప్పుడు ఊరూరి నీళ్ళ పడక భార్య జబ్బులో పడింది. రూపాయిని దమ్మిడిగా ఖర్చు పెట్టించింది. అహోరాత్రం సేవచేయించుకొనింది. కడకు వాలుగేళ్ల పసివాణ్ణి అతని చేతుల్లో పెట్టి తాను వెళ్లిపోయింది. మధుమూర్తి కళ్ళకాయలుగాచేలా ఏడ్చాడు. అతనికి బ్రతుకుమీద మమకారం చచ్చిపోయింది. ఉద్యోగానికి స్వస్తిచెప్పాడు. పిల్లవానిలో భవిష్యత్తును చిత్రించుకొని, అన్ని ఆశలూ వాడి మీదే పెట్టి ఊరుచేరాడు. భూమిరూపేణా బోలెడు ఆస్తి ఉంది. దానిని సాగుచేయిస్తూ కాలం నెట్టుకు వస్తున్నాడు.

ఊళ్లోవాళ్లందరూ రెండో పెండ్లి చేసుకొమ్మని పట్టుబట్టారు. ఎన్నో విధాల చెప్పి చూశారు. మధుమూర్తి సుతరామూ అందు కంగీకరించలేదు. ఆతడంగీకరించక పోవడానికి ప్రబల కారణమొకటుంది. మధుమూర్తిని భూమిమీద పడవేసి అతని తల్లి పరమపదించింది. ఆ పురిట్లో కనుకందును పెంచి పెద్దవాణ్ణి చేయడానికే అతని తండ్రి రెండోపెండ్లి చేసుకున్నాడు. అందువల్ల మధుమూర్తి పనతితల్లి ప్రేమను బాగాచవిచూశాడు. ఎక్కడో,దూరంగా, పట్నంలో చదువుకొంటూంటే గూడ ఆ ప్రేమ ప్రభావము అంత దూరము పొగలు సెగలు కక్కుతూ పయనించేది. తండ్రి ఆమె చేతుల్లో తోలుబొమ్మ అయిపోయాడు. కన్నతల్లి లేని కొరతను స్మరిస్తూ, భావి జీవితాన్ని గురించి విచారిస్తూ మధుమూర్తి చాల బాధపడేవాడు. ఒక్కొక్కరాత్రి చదువుకూడ మానేసి ఏకాంతంగా కూర్చుని ఏడ్చుకొనేవాడు. అంతా భగవన్నిర్ణయం. ఒకనాడు పొలం దగ్గర పినతల్లిని పాము కాటేసింది. ఆమె చనిపోయిందని లోకం చాటేసింది. ఆ దిగులులోనే తండ్రి మంచమెక్కాడు. ఎక్కిన మంచం దిగకుండా కన్ను మూశాడు. తనగతి తన బిడ్డకు సంక్రమించడం మధుమూర్తికి సుతరామూ ఇష్టం లేదు. అందుకే రెండో వివాహానికి తన అయిష్టం వెలిబుచ్చాడు.

తీరికసమయాల్లో మధుమూర్తి, పుల్లయ్యతో కాలం గడుపుతూ ఉంటాడు. పుల్లయ్య పూరింటి అరుగు ఒక చిన్న ఉపన్యాస వేదిక. పుల్లయ్య అరవైఏళ్ల అనుభవం వేదాంత రూపంగా బయట బడుతుంది. మధుమూర్తి నేటి రాజకీయాల వివరిస్తాడు. పాత కొత్తల సమ్మేళనం! పరిహాసంగా మారుతుంది. ఫక్కుమని నవ్వుకొంటారు ఇద్దరూ.

ఆవేళ హస్తసాముద్రికాన్నిగురించి మాట్లాడుతున్నారు. అంతలో మధుమూర్తి కొడుకు దినకర్ నిద్రలేచి ఏడుస్తూ వచ్చాడు. మధుమూర్తి పిల్లవాణ్ణి ఒడిలో కూర్చోబెట్టుకున్నాడు. సముదాయిస్తున్నాడు. దినకర్ ఇంటికి పోదాం రమ్మని బలవంతం చేస్తున్నాడు. దినకర్‌కు మంకుపట్టు చిన్నప్పటినుండి బాగా అలవాటయిపోయింది. తండ్రి తినిపిస్తేనేగాని తినడు. తండ్రి పక్కనుంటేగాని నిద్రపోడు. మధుమూర్తి అవస్థ పుల్లయ్యకు బాగా తెలుసు. మధుమూర్తి బాధలయినా భరిస్తాడు కానీ పిల్లవాని బాధ్యతను ఒకరిమీద పెట్టడానికి అంగీకరించడు. అలాంటప్పుడు ఏంజేయాలి? పుల్లయ్య మనస్సులో ఒక భావన లీలగా గోచరించింది.

"నీ చెయ్యిలా చూపు, నాయనా!"ఉన్నట్లుండి అడిగాడు పుల్లయ్య.

మధుమూర్తి కుడిచేతిని ముందుకు చాచాడు. ఇంతకుముందెప్పుడూ చూడనట్లుగా పుల్లయ్య అరచేతివంక పరీక్షగా చూశాడు.

"అదృష్టవంతుడివయ్యా!"

"ఎందుకూ?"

"అందరికీ అబ్బుతుందా ఆ బాగ్గెం! తినబుట్టినోడు తినాలిగానీ!"

"ఏమిటో ఆ భాగ్యం?" సందేహంగా అడిగాడు మధుమూర్తి.


"ముండగల్లరాలుసొత్తు, సొత్తులో చేరబోతూంది." మాట అనేసి వెర్రిగా నవ్వుతున్నాడు పుల్లయ్య.

"ఉండేది చాలక వెధవ సొత్తుకు ఆశిస్తానా?"

"అది గాదురా! నా పిచ్చితండ్రీ! ! ఏదీ? నేను ఆశిస్తాను. నాకు రమ్మనుమను చూద్దాం!"

ఇంతలో పిల్లవాని పోరు పెద్దదయింది. "మళ్లీ వస్తా"నంటూ మధుమూర్తి వెళ్లిపోయాడు. తన ఊహ ఎంతవరకు సమంజసమోనిని ఒక్కక్షణం ఆలోచనలోపడ్డాడు పుల్లయ్య.

అన్నెం పున్నెం ఎరుగని ఆడపడుచు! జీవిత సుధారసాన్నిజుర్రుకుందామని ప్రయత్నించి పాత్ర అందుకొనే లోపల చేజారి, క్రిందబడి, పగిలిపోయింది. బాల వితంతువు అనంతమ్మ జాలిగా ఎదుట నిలబడింది. మధుమూర్తిని ప్రక్కన నిలబెట్టి చూచాడు పుల్లయ్య. ఇద్దరూ ఒకరి కొకరు తోడుగా, ముద్దుగా, ఒద్దిగ్గా కనబడ్డారు.



మాతృమూర్తి

చిత్రం—పక్కి. శేషగిరిరావు (విజయనగరం)

సంతృప్తిగా నవ్వుకొన్నాడు.

అనంతమ్మ ఆ ఊళ్లో కలిగిన ఇంటికోడలు. ఆమె అడుగుపెట్టిన వేళా విశేషమేమోగానీ, ఆరునెలల్లో అత్త మామ, మరో సంవత్సరానికి భర్త ఆమె వద్ద నుండి శాశ్వతంగా సెలవు దీసుకొన్నారు. నెత్తిన వేసికొని కాల్చుకొనే అంత ఆస్తితో ఒక్కతిగ నిలబడింది. ఇప్పు డామె చేతికి అడ్డులేదు. 'కడపలో కాలుబెట్టిందో లేదో అందర్నీ మింగింది ముండ!' అని ఊళ్లో వాళ్లందరూ ఆమె మాటంటే చీదరించుకొంటారు. కానీ పిల్లా జెల్లా లేని పుల్లయ్యకు మాత్రం ఆమెమీద కాస్త జాలి. దీనికి తగ్గట్టుగ ఆమె కూడ తగిన ప్రతిఫలాన్ని అందిస్తూ ఉంటుంది.

అనుకోకుండా ఉండాలేగాని, అనుకుంటే అంతుదేల్చుకునే రకం పుల్లయ్య. అనుగుణంగా ప్రవర్తించాడు. అనుకున్నంత పనిచేశాడు. ఆ మీదట మధుమూర్తి అనంతమ్మకు దాసుడైపోవడం, ఆమె అతన్నివంచించి ఆస్తి లాక్కోవడం, అతని మనస్సు మార్చడానికి ఆమె వాడిన నాటు మందులతో అతనికి మతి భ్రమణ కలగడం, తుదకు అంతుతెలియకుండా దేశద్రిమ్మరికావడం, దినకర్ దిక్కులేని పక్షిలా వీధుల్లో నిలబడడం నెలల్లో జరిగిపోయింది.

దీనికి కారణం పుల్లయ్య అంటారు, ఊళ్లో వాళ్లంతా. అందరి కంటికీ అలుసయిపోయాడు. ఎవరూ మాట్లాడరు. ఏమి కావాలన్నా ఇవ్వరు. పైగాఏదో సాకుపెట్టి తిట్టుతూ ఉంటారు. అయితే పుల్లయ్య మాత్రం ఏం చేస్తాడు? ఆధారంలేని ఒక లతకు ఆధారం కల్పిద్దామనుకొన్నాడు. ఆ లత ఇంతయి, అంతయి, ఆ ఆధారాన్ని కబళించే సంగతి అతనికి మాత్రం ఏం తెలుసు? తెలియదు కాబట్టే తప్పు అనుభవిస్తున్నాడు. అందుకే ఇల్లు, పుట్టిన ఊరు వదలి, మడిచేను మూడు కాసులకు ధారపోసి దినకర్‌ను తీసుకుని బయలుదేరాడు.

* * * *

"అబ్బా! ఏందో కరిసింది తాతా!"

అరిచాడు దినకర్. చేతిపట్టు వదలిపోయింది. గింగిలా తన్నుకుంటూ ఉండిన తుమ్మెద ఎగిరిపోయింది. పుల్లయ్య ఈ లోకంలో పడ్డాడు. ఆత్రంగా పిల్లవాణ్ణి ఎత్తుకున్నాడు. కాలిమీద ఎర్రచీమ పారాడుతూ ఉంది. నలిపివేశాడు. కడసారిగా మరొక్కసారి ఊరివైపు చూశాడు. తాతముత్తాతల సొత్తు స్మృతిచిహ్నం. తన జీవితానికి సాదృశ్యం. ఊరిమూల బూడిదగుట్టలో మొండి గోడలు, అరవై సంవత్సరాలు తనకు ఆశ్రయమిచ్చిన గూటి దూలాలు దీనదృక్కుల ప్రసరిస్తున్నట్లుంది. అమ్మ తొమ్మిది నెలలు మోసింది. ఈ యిల్లు అరవైఏళ్ళ ఆశ్రయమిచ్చింది. అందుకేనేమో జననితో జన్మ భూమిని పోలుస్తారు. ఓ వింతభావం అతని మనో వీధిలో మెదిలింది. రెండు కన్నీటి చుక్కలు టపటప

(తరువాయి 50..వ పేజీలో)



అలంకరణ
చిత్రం—పి. లక్ష్మణరావు (జాలాపుట్)

## 'గూడులేని గువ్వలు'

(44వ పేజీ తరువాయి)

రాలాయి. గ్రీరున తిరిగి బయలుదేరాడు.

పుల్లయ్య పనపాకం రైల్వే స్టేషనులో అడుగు పెట్టే టప్పటికి కనుచీకటి పడింది. పిల్లవాడు 'ఆకలో' అని అరుస్తున్నాడు. కాళ్ళు కుక్కలు పెరికినట్లు పీకుతున్నాయి. ఫ్లాట్‌ఫారం మీద ఒక చిన్న మర్రిచెట్టు. ఆచెట్టు క్రింద ఒక సిమెంటు బెంచీ. ఆ బెంచీమీద చతికిలబడ్డాడు. సద్దికూడు మూట విప్పాడు. పిల్లవానికంత పెట్టాడు. తానంత తిన్నాడు. ప్రక్కనే ఉందొక కొళాయి. కడుపు నిండుగ నీళ్ళు త్రాగాడు. ప్రాణం లేచివచ్చినట్లనిపించింది. దోపెట్లో పట్టి రెండు గుక్కలు పిల్లవానికి తాగించాడు. రైలుబండి తొమ్మిరాత్రికి పైగా వస్తుందన్నారు. అంత సేపు అలా పడిలేయాలనిపించింది. పైగుడ్డ పరుచుకొన్నాడు. పిల్లవాణ్ణి ప్రక్కలో పడుకో బెట్టుకొని పడుకొన్నాడు. కష్టమెరుగని ప్రాణం. పది, పదకొండు మైళ్ళు కాళ్లీడ్చుకొంటూ నడిచి వచ్చాడు. బాగాఅలసిపోయాడు. అలా పండుకొన్నాడో లేదో నిద్ర ముంచుకు వచ్చింది. బాగా నిద్ర పోయాడు.

రైలు వచ్చింది. పోయింది. సగం రాత్రికి పైగా మరలా ఒక బండి వచ్చింది. అదిగూడ పోయింది.

పుల్లయ్య నిద్రలేచేసరికి అరచేతి గీతలు బాగా తెలుస్తున్నాయి. తూర్పు పటమెగిరింది. మర్రి మాను మీద కాకులు లోకం మీద పడడానికేమో కలిసి మాట్లాడుకొంటున్నాయి. ఒక రోగోలగా ఉంది. స్టేషన్ కెదురుగా బోడిగుట్ట. ఆ గుట్ట నిండా నల్లరాళ్ళు. 'మా మాదిరి చలన రహితంగా పడి ఉన్న వాడివి మారుమూలపల్లెలో! ఎందు కొచ్చిన శ్రమఖదంతా! ఈ తీరయితే ఈపట్నాల్లో పొట్టనింపుకోగలవా?'—అని పుల్లయ్యను చూచి వెక్కిరిస్తున్నాయి. ఎప్పుడువచ్చిందో ఫ్లాట్‌ఫారంమీద రైలుబండి 'వే వెళతా'నంటూ కూతవేసి హెచ్చరిస్తూ ఉంది. ఆ కూతతో పుల్లయ్యకు మిగిలిన కాస్త నిద్రమత్తూ వదలి పోయింది. నిద్రబోతున్న దివకర్‌ను భుజాన వేసుకున్నాడు. ఆదరాబాదరా బండి ఎక్కాడు. పీడి పోయిన తలగుడ్డ భుజంమీదపడి క్రిందివరకు మానిబోదెమీది తీగలా జీరాడుతూ ఉంది. ఒక చేతితో రాత్రి మిగిలిన సద్దికూడు మూట జారి క్రిందపడేటట్లుంది. అతని హడావుడి జూచి రైలు పెట్టెల్లోని వాళ్ళంతా నవ్వు తున్నారు.

"ఎక్కడ పోవాలయ్యా?" అందులో ఒక పెద్దాయన అడిగాడు.

బండి వెళ్లిపోతుందేమో అన్న కలవరపాటుతో ఉన్నాడు పుల్లయ్య. "తిరపతికి" అని ముక్త సరిగ, త్రుంచినటుల సమాధానం చెప్పాడు.

"అయ్యో! నీ పాపం గూల! బండి పాకాలకు పోతుందిగదయ్యా!" ఆ మాటతో ఎగిరిపడ్డాడు పుల్లయ్య. ఎంత తొందరగ ఎక్కాడో అంత తొందరగ దిగేశాడు. రైలు కదిలిపోయింది.

తిరుపతికి వెళ్లేబండి తొమ్మిది గంటలకు పైగా వస్తుందన్నారు. ఈ లోపుగ పళ్ళు తోము కున్నాడు. కొళాయిలో నీరు ధారాళంగా వస్తూ ఉంది. తాను మొగం కడుక్కొన్నాడు. పిల్లవానికి మొగం కడిగాడు. చెరొక పిడికెడు సద్దికూడు తిందామని మూట విప్పాడు. ఎండిన మెతుకులు మేకుల్లా ఉన్నాయి. టఫిన్లు, కాఫీలకు అలవాటు పడ్డాడు దివకర్. అదిచూసేసరికిమనస్సు గతుక్కు మనింది. ఆరేండ్లు నిండీ నిండని పసివాడు. ఏమని అడుగుతాడు? ఈ తరగతి పిల్లవాండ్ల కంతా భగవత్ప్రసాదితమైన ఆయుధం వాళ్ల చిన్న జేబుల్లో తయారుగ ఉంటుంది. దివకర్ కూడ దాన్నే ఉపయోగించాడు. గుడ్లనిండుగ నీళ్ళు కమ్ముకున్నాయి. పాలబుగ్గలమీద పిల్ల కాల్వలైనాయి. అవును మరి. దివకర్ కలిగిన ఇంటి బిడ్డ. అందులో ఒక్కగా నొక్కడు. దొరలచేతి నిమ్మపండులా పెరిగాడు. కాలదోషం కొట్టింది. అయితే చచ్చేటంతమాత్రం సింహం కసవు తింటుందా?

పుల్లయ్య ఆ దృశ్యాన్ని చూశాడు. అతని గుండె చెరువయింది. పిల్లవాణ్ణి అక్కున చేర్చు కున్నాడు. కళ్లనీళ్ళు తుడిచాడు. స్టేషనుకు పది బారల దూరంలో చెట్టుక్రింద ఒక చిన్న టీ కొట్టుంది. పిల్లవాణ్ణి అక్కడికి తీసుకెళ్లాడు. రెండు ఇడ్లీ తినిపించాడు. అరకప్పు టీ త్రాగిం చాడు. బేడ డబ్బులయిందని అంగడివాడు చేయి చాచాడు. ఆ చేతిని కొంతసేపు పరీక్షగా చూశాడు పుల్లయ్య.

"నీకు మొదట కొడుకు పుట్టాడు గద, నాయనా!"

ఆ మాటతో అమాంతంగా పైకి లేచాడు, అంగడివాడు. పుల్లయ్యను బలవంతంగా కూర్చోబెట్టాడు. అంగట్లో రెండు వక్కలు, ఆకూ తీసుకొన్నాడు. పావలా దక్షిణ బెట్టాడు. కుడిచేతిని శుభ్రంగా కడుక్కొన్నాడు. పైగుడ్డతో తడి ఒత్తివేశాడు. ముందుకు చాచాడు.

"నాయనా! అబ్బ, అమ్మకు ఒక్కడివే కొడుకువి. వాళ్ళు మిగిలించిందల్లా నిన్నొక్కణ్ణే భూమ్మీద! వాళ్ళగూడ చెల్లిపోయారు. ఏమంటావ్?"

శాస్త్రానికి కూర్చుంటే పుల్లయ్య పలుకులో మలుపు ఉంటుంది. ప్రశ్నార్థకంగా అంగడి వాని వైపు చూశాడు. అతని మొగంలో ఆశ్చర్యం చిందులాడుతూ ఉంది. 'అవు'నని తల ఊపాడు. పుల్లయ్య గురి బాగా పారింది.

"చూడబ్బాయ్! బంగారంలాంటి పెళ్లాం దొరికింది నీకు. ఆమెవల్ల సంసారం వృద్ధవు

తుంది. అదృష్టరేఖ జీవితరేఖతో కలిసి శనిక్షేత్రానికి ఎగ్రబాకింది. ఇక పోతే వ్యాపారరేఖ బుధస్థానాన్ని చూస్తూ ఉంది. ఈ రెండు రేఖల ఫలితంగా నీ స్వశక్తితో నీకు మంచి భవిష్యత్తు కనబడుతూంది. ఈ చింతచెట్టు క్రింద చిల్లరంగడి తిరుపతి పెద్ద బజారులో పేరుదెచ్చుకొంటుంది!"

"అయితే నా కోరిక నెరవేరుతుందన్న మాట!"ఎగిరి గంతేశాడు అంగడివాడు.

పుల్లయ్య స్వరం చూచుకొన్నాడు. చంద్రనాడి కొంచెం చల్లుతున్నట్టుంది. అయినా, 'దినవాడి' కాబట్టి ఫరవాలేదనుకొన్నాడు. "కాదు గీదంటే కాస్త ఆలస్యం కావచ్చు"నని చెప్పాడు. ఇంతలో రైల్వేస్టేషన్‌లో కొట్టిన గంట వినబడింది. బండి వచ్చేవేళ అయిందన్నారు. పుల్లయ్య తాంబూలాన్ని మడిచి ఒడిలో దోపుకున్నాడు. "వస్తా నాయనా!" అంటూ లేచాడు. అంగడివాడు అంజలి ఘటిస్తూ సాగనంపాడు.

పిల్లవాణ్ణి చిన్నగానడిపించుకొంటూ,పుల్లయ్య స్టేషన్‌లో అడుగు పెట్టాడు. మరలా రెండవ సారి గంట కొట్టారు. తిరుపతికి టిక్కెట్టు కొన్నాడు. అంతలో బండి వచ్చి ఆగింది. టిక్కెట్ కొంగులో భద్రంగా ముడిపెట్టుకొన్నాడు. రైలు రద్దీగా ఉంది. ఎక్కడచూచినా సందు లేదు. బండి పోతుందేమోనని తొందర తొందరగా ఈ ప్రక్కకు, ఆప్రక్కకు పరుగెత్తాడు. ఒకపెట్టె మాత్రం ఖాళీగా కనబడింది. అందులో ఎక్కాడు. 'పరుపులు గిరుపులు బలే బాగుండాయి! ఎఱ్ఱి నాయాలి గుంపు ఎందుకట్ల తొక్కులాడతా ఉండారు!' అనుకొన్నాడు. పిల్లవాణ్ణి కూర్చో బెట్టాడు. ఎదురుగ ఉన్న నిలువుటద్దంలో చూచుకొని తలపాగా సర్దుకొన్నాడు. బుఱ్ఱ మీసం దువ్వుకొన్నాడు. ధీమాగా కూర్చున్నాడు.

బండి కదులుతూంది. టి.టి.ఇ. అదేపెట్టెలో ఎక్కాడు. పుల్లయ్య వాలకం చూపి మంచికేసు అని నవ్వుకున్నాడు. టిక్కెట్టుకోసం చెయ్యి చాచాడు. పుల్లయ్య కొంగు ముడి విప్పిటిక్కెట్టు చూపించాడు.

"మూడో తరగతి టిక్కెట్టుతో మొదటి తరగతిలో దొర మాదిరి కూర్చున్నావే?"

"ఈ కడమండి, ఆ కడదాక రైలంతా ఒకటే గద నాయనా! మల్లా ఏంది దీంట్లో రెండు రకాలు?"

"ఆ! మాటలు గూడ జోరుగా ఉన్నాయే! ఆ పిల్లోడి టిక్కెట్టెక్కడ?"

"బుడంకాయంత బుల్లోడు! వాడికేంది నాయనా టిక్కెట్టు!"

"అదంతా ఏమీ జరుగదు. నువ్వు మూడో తరగతి 'టిక్కెట్టు'తో మొదటి తరగతిలో ప్రయాణంచేసినందుకు పిల్లోడికి టిక్కెట్టు కొననందుకు అదనపు చార్జి కట్టాలి. ఎత్తు డబ్బు!"

టి. టి. ఇ. గదమాయించాడు. డబ్బులు మాట ఎత్తేసరికి పుల్లయ్య గుండెల్లో రాయి పడింది. అయినా మనిషి తొణకలేదు. టి.టి.ఇ.ని పరిశీలనగా చూశాడు. వయస్సు పాతికకు పైగా ఉంటుంది. ఒత్తుగా పెరిగిన గడ్డము, మత్తుగా ఎఱ్ఱబారిన కన్నులూ..... మనిషి చూడ్డానికి భయంకరంగా కన్పిస్తున్నాడు... కానీ వయస్సుకు తగ్గ తేజస్సు ఆ మొగాన గోచరించలేదు. మరలా డబ్బుకోసం చాచిన అరచేతి వైపు దృష్టి మరల్చాడు. హృదయరేఖ సూర్య స్థానంలో తెగిఉంది. వాతలు బెట్టినట్టుగ వివాహ రేకలు రెండున్నాయి. పుల్లయ్య ఒక నిర్ణయానికి వచ్చేశాడు. ఇదంతా నిమిషాల్లో జరిగిపోయింది.

"నాయనా! నువ్వు ప్రేమించిన అమ్మాయికి పెండ్లయింది గదూ!"

డబ్బుకోసం చాచిన చెయ్యి మెల్లంగా క్రిందికి జారిపోయింది. మానుతూ ఉండిన గాయం మరలా కెలికినట్టయింది. విచారంగా పుల్లయ్య ప్రక్కన కూర్చున్నాడు. ఇంతలో ముంగిలి పట్టు పాల్పుతో బండి నిల్చింది.

పుల్లయ్య టి.టి.ఇ. కుడిచేతిని పట్టుకొన్నాడు. రైలుకూత జయధ్వానం పలికింది. రైలుసాగింది. శాస్త్రం ఆరంభమయింది. రైలు బాటప్రక్కన చెట్లుచేమలు వెనక్కు పరుగెడుతూన్నాయి. పుల్లయ్య గతంలోనికి దారి తీశాడు. బండి మంచి వేగాన్నిలంఘించుకొనింది. శాస్త్రం భవిష్యత్తులో ఘాటుగా, నిరాఘాటంగా, నీళ్ల వాటంగా పరుగులు దీస్తూంది. కదనరంగంలో విజయాన్ని సాధించి తిరిగివచ్చే వీరసైనికుడులా హుందాగా నడుస్తూ, ప్లాట్‌ఫారంలోని ప్రయాణికులు ఆహ్వానిస్తూంటే తిరుపతి ప్లాట్‌ఫారంలో బండి ఆగింది. శాస్త్రం విజయవంతం అయింది.

పుల్లయ్య టి.టి.ఇ. ధర్మాన గేటుదాటి బయటపడ్డాడు. స్టేషను ముందు వచ్చేపోయే కార్లు, రిక్షాలు, జనం.... గంగమ్మ జాతర జరిగినట్లు రంపు! పాట్టకఱ్ఱకొచ్చిన జొన్నచేని దగ్గర సీతాకోక చిలుకల్లా స్త్రీలు... అంతా వింతగా ఉంది. విసిరిపారేసినట్లున్న పల్లెటూళ్లో బ్రతికిన పుల్లయ్యకు ఏదో క్రొత్త ప్రపంచంలో అడుగు బెట్టినట్లనిపించింది. 'ఈ కొత్తలోకంలో బతగ్గలమా!' అన్న సందేహం గలిగింది. ఒక్క క్షణం నిలబడిపోయాడు. చింతచెట్టు క్రింద చిల్లర అంగడి, రైలు పెట్టెలో టి.టి.ఇ. కనుల ముందు మెదిలారు. "సోకం తెలిస్తే లోకంలో కూటికి కొదవలేదులే!" అన్నభావం హృదయాంతరాళంలో పుట్టి, ముఖాన్ని ఆవరించుకొని, కన్నులలో సంతృప్తిగ, పెదవులపై చిరునవ్వుగ పైకి వచ్చింది. అమాంతంగా పిల్లవాణ్ణి ఎత్తుకొని గుండెకు హత్తుకొన్నాడు. దినకర్ చిత్తఱపోయి చూస్తున్నాడు. చిరునవ్వులో ఆత్మసంతృప్తి చిందులాడుతుంటే, పిల్లవాణ్ణి పైకితేవాలన్న పట్టుదల, ఆత్మవిశ్వాసం ముందుకు లాగుతూంటే, పుల్లయ్య ముందుకు అడుగు వేశాడు. ★



జాలరి

ఫోటో—ఎస్. వి. రావు (మద్రాసు-7)